# కల

## శ్రీ యఱ్ఱంశెట్టి శాయి

రుక్మిణి అద్దంలో చూసుకొంది. చీరా, జాకెట్టూ బాగానే అమిరినయి. కాని మెడ బోసిగా కనబడిపోతోంది. ఉన్న ఒక్క ఒంటిపేటగొలుసు కూడా అమ్మ జబ్బుకోసం అమ్మేయాల్సివచ్చింది. దాంతో చెవులకి రింగులుతప్ప మరే ఆభరణమూ మిగలకుండాపోయింది.

పెళ్ళిబాజాలు మ్రోగటం మొదలెట్టినయి. ప్రొద్దుట్నుంచీ చెవులు గింగుర్లెత్తించేస్తోన్న సినిమా రికార్డులు ఆపేశారు. పదకొండూ తొమ్మిది నిమషాలకి ముహూర్తం. టైమెంతయిందో. గోడకున్న తాతలనాటి గడియారం ఎప్పుడూ సరయిన టైము చూపించదు. అర్ధగంటముందో, వెనుకో నడుస్తూంటుంది. పదవుతూండొచ్చు ఇప్పుడు. ఇక బయల్దేరటం మంచిది. గంటయినా ముందు వెళ్ళకపోతే సావిత్రి గొడవ చేస్తుంది. ఇద్దరిదీ చిన్నప్పట్నుంచీ ప్రాణస్నేహం. అందుకే వెళ్ళక తప్పడంలేదు.

'మన గ్రూప్‌లో అందరికీ పెళ్ళిళ్ళయిపోయినయి. ఎక్కడెక్కడికో ఎగిరిపోయారు. మిగిలింది మనిద్దరం. నా పెళ్ళికి నువ్ రాపోతే ఎలాగే?' నాల్రోజులముందు అడిగింది సావిత్రి.

'అమ్మకి వంట్లో బావుండలేదే. నేనెప్పుడూ దగ్గరే ఉండాలి...' అని చెప్పినా వినిపించుకోలేదు.

'కనీసం ఆ గంటయినా నువ్వు నాదగ్గరుండాలి. ఏం?......మర్చిపోకు. రాపోతే నేనింక మాట్లాడన్నీతో......'అనేసి వెళ్ళిపోయింది.

ప్రక్కగదిలో తల్లి మంచందగ్గరకు వెళ్ళి 'అమ్మా వెళ్ళొస్తానే...' అంది రుక్మిణి.

'వెళ్ళు...త్వరగా వచ్చెయ్...' నీరసంగా అంది తల్లి.

తలుపులు దగ్గరగావేసి రోడ్డుమీదకొచ్చింది రుక్మిణి. తమ ఇంటికి నాలుగిళ్ళవతలే సావిత్రి ఇల్లు. ఎదురుగ్గా ఉన్న మేడమీదకి క్రీగంట చూసిందామె. తనవంకే చూస్తున్నాడతను. తల వంచేసుకొని వడివడిగా నడిచి సావిత్రి ఇల్లు చేరుకొందామె. కాంపౌండంతా పెద్దపందిరి వేశారు. రంగురంగుల కాగితాలతో, మామిడి తోరణాలతో, కొబ్బరిమండలతో అందంగా, హుందాగా ఉంది పందిరి. ఓ ప్రక్కంతా కుర్చీలు వేశారు. వాటినిండా మొగాళ్ళు కూచున్నారు. వివాహ మండపంచుట్టూ చాపలమీద ఆడవాళ్ళు, పిల్లలు కూచున్నారు. చాలామంది ఆడవాళ్ళు హడావుడిగా తిరుగుతున్నారు. పెళ్ళికొడుకుని అప్పుడే పీటలమీద కూర్చోబెట్టేశారు. ఇంట్లోకి నడిచింది రుక్మిణి. సావిత్రి రెండో అక్కమణి ఎదురొచ్చింది.

'ఏమోయ్! ఇప్పుడా రావటం? ఇప్పటికిప్పుడే పాతికసార్లడిగింది పెళ్ళికూతురు. ఆ గదిలో వుంది...వెళ్ళు'...

లోపలి కెళ్ళింది రుక్మిణి.

సావిత్రి అక్కడ ఓ సోఫాలో కూర్చుంది. చుట్టూ కొంతమంది ఆడపిల్లలు కూర్చున్నారు. సావిత్రి పిన్నమ్మలు హడావుడిగా ఏదో మాట్లాడుకొంటున్నారు. సిల్కుచీరతో, బుగ్గన చుక్క, మెరసిపోతూన్న నగలతో క్రొత్త అందంతో కనబడుతోంది సావిత్రి. సావిత్రి ప్రక్కనే సోఫాలో కూర్చుంది రుక్మిణి.

'ఇంతసేపేం చేస్తున్నావే? 'బోర్' కొట్టేస్తోంటేనూ...ఇంట్లో ఏం రాచకార్యం వెలగబెడుతున్నావ్?...' కోపంగా అంది సావిత్రి.

'అమ్మకి గంట గంటకీ మందివ్వాలే...నీకు చెప్పానుగా...'

'మీ తమ్ముడేమయ్యాడు?'

'వాడింటిపట్టున వుండటం కూడానా? ప్రొద్దున్న పోతే సాయంత్రం వస్తాడు...'

ఫ్లాస్కులోంచి ఓవల్టిన్ రెండు గ్లాసుల్లోకి వంచి ఇద్దరికీ ఇచ్చింది పిన్నమ్మ.

సావిత్రి వంకే చూసి 'నీకు పెళ్ళికళ వచ్చేసిందే!' అంది రుక్మిణి నవ్వుతూ.

'ఊహు! పెళ్ళికళ అంటే ఎలా వుంటుందో?'

'అచ్చం ఇప్పుడు నువ్వున్నలానే...'

'అలాగా! నేనెప్పుడూ ఉన్నట్లే ఉన్నాను. ఆ మార్పేదో నీ కళ్ళకే వచ్చింది!' రుక్మిణి బుగ్గ గిల్లుతూ అంది సావిత్రి.

'పెళ్ళికూతురిని తీసుకురండి. పురోహితుడు తొందర చేస్తున్నాడు...' ఓ మధ్యవయసావిడ గదిలోకి చూచి అరిచి వెళ్ళిపోయింది.

'ఇంతకీ శ్రీవార్ని సరిగ్గా చూసుకొన్నావా?'

'పెళ్ళిచూపుల రోజే చూశాను...' అంది సావిత్రి నవ్వుతూ.

'అప్పుడంటే ఖంగారుగా చూసి వుంటావనుకో. నిన్ననగా వచ్చి ఎదురింట్లో దిగారు కదా వాళ్ళు... ఏ కిటికీలో నుంచో చూపుపడకపోయిందా అని...'

సావిత్రి చిన్నగా నవ్వేసి ఊరుకొంది.

'చెప్పు బుల్లీ! ఎప్పుడు చూశావ్?'

'ఊహు!' అంది సావిత్రి సిగ్గుపడుతూ.

'ఫర్వాలేదు. ఆయనదగ్గర సిగ్గుపడుదుగాని... చెప్పు...'

'ప్రొద్దున్న స్నేహితులతో వెడుతూంటే చూశాను.'

'అట్లాఅయితే నీ టైమంతా ఈ కిటికీకే చాలుండదివాళ......'

ఇద్దరూ కిలకిల నవ్వుకున్నారు.

'పదమ్మాయ్......' ఓ పిన్నమ్మ హడావుడిగా వచ్చి సావిత్రిని నడిపించుకువెళ్ళింది.

'పందిట్లో నా దగ్గరే కూచో......' అంది సావిత్రి వెడుతూ.

వెనుకే నడిచి మండపానికి దగ్గర్లో కూచుంది రుక్మిణి.

'మా సావిత్రి స్నేహితురాలు. ఇంకా పెళ్లి కాలేదు పాపం!'

సావిత్రిపిన్ని తన గురించి ఓ మధ్యవయసావిడికి చెబుతోంది. తల మరోవేపుకి త్రిప్పుకొంది రుక్మిణి. మనసుకి చాలా కఠినంగా తాకిందామాట. చాలామంది ఆడవాళ్ళు తనవంకే చూస్తున్నట్లు అనిపించింది. నిజంగా 'పాపం' అని జాలిపడదగ్గ పరిస్థితిలో ఉన్నదా తను. సావిత్రికంటె నాలుగేళ్ళు పెద్దది తను. అంతమాత్రాన తనకి పెళ్ళీడు దాటిపోయినట్లేనా?... ఆలోచిస్తే నిజమేనేమో అనిపిస్తోంది. తమ స్నేహితురాండ్రలో తనూ, సావిత్రీతప్ప అందరికీ పెళ్ళిళ్ళు అయిపోయినయి. అందరిలోకీ వయసులో చిన్నదయిన సరస్వతిగ్గూడా సంవత్సరం క్రితమే వివాహం అయిపోయింది. ఇప్పుడు సావిత్రి. తానొక్కర్తే ఒంటరిగా మిగిలిపోయింది.

బాజాలు గట్టిగా మ్రోగసాగాయి. పెళ్లికొడుకు సావిత్రి మెడలో మంగళసూత్రం కడుతున్నాడు. అతని స్నేహితులు ఏదో అని నవ్వుతున్నారు. సావిత్రి తల భూమిలోకి వంచేసుకొంది సిగ్గుతో. ఆమె చిన్నచెల్లాయ్వచ్చి తన ప్రక్కన కూర్చుని ఏదో నవ్వుతూ అంటోంది.

రుక్మిణి కివేవీ వినబడటంలేదు. మనసంతా గందరగోళంగావుంది. చాలాసేపటివరకూ కళ్లప్పగించి చూస్తూండిపోయింది.

'ప్రెజెంటేషన్స్......' అంటూ ఒకరు అరిచారు.

లేచి నుంచుంది రుక్మిణి. అందరూ బహుమతులు చదివించటానికి గుమికూడారు. సావిత్రికి

ప్రాణస్నేహితురాలయి కూడా తనేమీ ఇవ్వలేక పోతోంది. ఇక అక్కడ వుండటానికి మనస్కరించ లేదు రుక్మిణికి. మెల్లగా బయటకు నడిచింది. ఇంటి దగ్గరకొచ్చి అనుకోకుండానే తలెత్తి మేడ మీదకు చూసింది. అతను కిటికీలోనుంచి తనవంకే చూసి నవ్వుతున్నాడు. చటుక్కున తలవంచేసుకొని వడివడిగా ఇంట్లోకి నడిచి తలుపులు మూసివేసి 'హమ్మయ్య!' అని గుండెలమీద చెయ్యి వేసుకొంది గదిలో తల్లి నిద్రపోతోంది. ఆమెని చూస్తుంటే జాలివేసింది రుక్మిణికి. కళ్ళవెంబడి నీళ్ళు తిరిగినయి.

'పాపం! ఏ నాడూ సుఖం లేదు అమ్మకి. ఎప్పుడూ ఏవో బాధలు. అక్కయ్య పెళ్ళి అవలేదనే దిగులుతో మంచం పట్టింది. భగవంతుడి దయవల్ల అక్కయ్యకి కొద్ది రోజుల క్రితమే వివాహం అయింది. కాని తల్లి అనారోగ్యం ఇంకొంచెం విజృంభించింది. ఆమె ప్రాణానికి తన పెళ్ళి సమస్యొకటి. తమ్ముడు బి ఏ లో చేరాడు. ఎక్కడలేని డబ్బూ వాడి ఫీజులకి కడుతూండాలి.'

'అమ్మాయ్!' లోపలికొస్తూ పిలిచారు శంకరం గారు.

'ఏం నాన్నగారూ?'

'కొంచెం త్వరగా భోజనం వడ్డించమ్మా! ఇనిస్పెక్షనవుతోంది. వెంటవే వెళ్ళిపోవాలి...' కాళ్ళు కడుక్కోటానికి పెరట్లోకి నడిచాడాయన.

అస్థిపంజరంలాఉన్న తండ్రినిచూసి నిట్టూర్చింది రుక్మిణి.

'ఇంకెన్నాళ్ళు నాన్నా ఈ కష్టాలు మీకూ. ఇక వీటికి అంతులేదా. ప్రొద్దుట్నుంచీ, రాత్రిదాకా ఆ ఆఫీసులో ఎందుకలా చాకిరీ చేస్తారు? మీ ఆరోగ్యం సంగతి మీకూ పట్టదా?...'

వంటింట్లోకి వెళ్ళి ఆయనకి భోజనం వడ్డించింది రుక్మిణి. త్వర త్వరగా భోజనం ముగించి ఆఫీసుకి వెళ్ళిపోయాడాయన.

సత్యం రాలేదింకా. వాడెక్కడ తిరుగుతున్నాడో...వాడిష్టంగా వుంది. ఎప్పుడూ, స్నేహితులూ, సినిమాలూ...

'రుక్కూ!' అమ్మలేచినట్లుంది! పిలుస్తోంది.

'ఏమిటమ్మా! ఆమె మంచంమీద కూచుంటూ అడిగింది రుక్మిణి.

'నాన్నగారు భోజనాని కొచ్చేరా?'

'వచ్చి వెళ్ళిపోయారమ్మా! నువ్ నిద్రపోతున్నావని లేపలేదు'

'మరి నువ్ తిన్నావా?'

'లేదమ్మా! తమ్ముడొస్తాడేమో అని చూస్తున్నాను. ఇద్దరం ఒకేసారి చేసెయ్యొచ్చు!'

'అదేమిటి. సావిత్రీవాళ్ళింట్లో భోజనం చెయ్యలా?'

'ఊహు! వద్దమ్మా! అక్కడొద్దు...' కళ్ళవెంబడి నీళ్ళు తిరిగినయి రుక్మిణికి. తల్లికి కనిపించకుండా ముఖం మరోవేపుకి త్రిప్పుకొంది. కొద్ది క్షణాలాగి ఆవిడికి మందు త్రాగించి, బత్తాయి తొనలు తీసిచ్చింది.

'నా కికరాదు. నువ్వెళ్ళి అన్నం...తినె...య్' అంది తల్లి.

లేచి వంటింట్లోకి నడిచింది రుక్మిణి. కంచంలో అన్నం వడ్డించుకొన్నది కాని, తిన బుద్ధి కావడంలేదు. తినకుండానే లేచి ప్రక్కగదిలోకి వెళ్ళి మంచంమీద వ్రాలిపోయింది. టైము మూడు చూపిస్తోంది గడియారం. అంటే రెండున్నరో, మూడున్నరో అయిందన్నమాట. మనసంతా గజిబిజిగా వుంది. పెళ్ళిలో ఆమె అన్నమాటే గుర్తుకొస్తోంది. తనకి పెళ్ళీడు దాటిపోయిందా? అసలు పెళ్ళీడు ఎంత? తన కిప్పుడు ఇరవై అయిదేళ్ళు. ఇది చాలా ఎక్కువా? ఏమో?

అయిదారు రోజులవరకూ మామూలు మనిషి కాలేకపోయిం దామె. సీతమ్మగారి ఆరోగ్యం ఇప్పుడు కొంచెం కుదుటబడింది. ఆవేళ సాయింత్రం రుక్మిణి వంటింట్లో ఆవిడకోసమని జావ కాస్తుంటే బయట బండి ఆగిన చప్పుడయింది. బయటికొచ్చి చూచిం దామె. అక్కా బావా బండి దిగారు.

'అమ్మా అక్కయ్యా, బావా వచ్చారు...' అంది తల్లితో సంతోషంగా.

బండివాడు సామాను లోపల పెట్టి వెళ్ళి పోయాడు.

'ఏం రుక్కూ! అమ్మ కెలావుంది...' నవ్వుతూ అడిగాడు బావ.

'ఇప్పుడు ఫర్వాలేదు బావా!' అంది రుక్మిణి మందహాసంతో.

లోపలికివెళ్ళి పదినిమిషాల్లో కాఫీ చేసుకొచ్చి రెండు కప్పుల్లో అక్కకీ బావకీ ఇచ్చింది. అక్కయ్య అత్తగారింటి గురించి అమ్మకి కబుర్లు చెబుతోంది. తను వెళ్ళి మళ్ళీ వంటపనిలో మునిగిపోయింది రుక్మిణి. రాత్రి ఎనిమిదింటికి సత్యం వచ్చాడు. మధ్యాహ్నం మళ్ళీ భోజనానికి రాలేదు. ఎక్కడో స్నేహితుడింట్లో భోజనం చేశాడుట.

'ఏం స్నేహాలా? ఇంటికి రాకుండా?' అంది సత్యవతి.

'అలా గనకక్కాయ్! స్నేహాలు చేయక మొగాడూ, చేసి ఆడదీ చెడిపోతారని అన్నారు. కావాలంటే బావగారి నడుగు!' అన్నాడు నవ్వుతూ.

'అవునోయ్! నిజమే అది. అందుకే మీ అక్కయ్యని ఇల్లు కదలనీయటంలేదు నేను...' అన్నాడాయన పరిహాసంగా.

అందరూ భోజనాలు ముగించారు. అక్కా బావా పడగ్గదిలో పడుకొన్నారు. రుక్మిణి తనకీ, తండ్రికీ తల్లి గదిలోనే ప్రక్కలు పరిచింది. సత్యం డాబా మీద కెక్కి పడుకొన్నాడు. శంకరంగారు రాత్రి పదిగంటల కొచ్చారు. ఆయనకి భోజనం వడ్డించి మళ్ళీ ప్రక్కమీదకు చేరిందామె. నిద్ర పట్టటం లేదు. తండ్రి వెంటనే నిద్రలో మునిగిపోయాడు. అమ్మ కూడా నిద్రపోతోంది. పదకొండుగంటలు కొట్టింది గడియారం. తరువాత పెండ్యులంచేసే చప్పుడు స్పష్టంగా వినిపించసాగింది. బయట వెన్నెల పిండారబోసినట్లుంది. రుక్మిణి మనసులో ఏవేవో ఆలోచనలు కెరటాల్లా వచ్చిపడుతున్నాయి. తన కింక వివాహం కాదు. అక్కయ్య పెళ్ళికయిన అప్పే ఇంత వరకూ సగంకూడా తీరలేదు. తమ్ముడు ఉద్యోగం చేసేసరికి ఎలాగూ ఇంకోమూడేళ్ళు పడుతుంది. అంటే తన కప్పటికి ఇరవైఎనిమిదేళ్ళు వచ్చేస్తాయి. అప్పుడు మరీ కష్టం. కట్నం ఇచ్చినా కుర్రాళ్ళు కనబడరు. ఛీ! లేనివాళ్ళింట్లో ఆడదయి పుట్టి నంత మహాపాతకం మరొకటిలేదు. ఆడపిల్ల కంత కంటె పెద్దశిక్ష మరేమీలేదు కూడా. గదిలో ఉక్కగావుంది. క్రింద చాపమీద పడుకోవడంవల్ల గాలి అసలు రావడంలేదు. జాకెట్టంతా చెమటతో తడిసిపోతోంది. డాబామీద పడుకొంటే బావుండు ననిపించింది రుక్మిణికి. దుప్పటి, దిండు, చాప తీసుకొని డాబామీదకి బయల్దేరింది. ప్రక్కగదిలోనుంచి మాటలు వినిపించినయి.

'అబ్బ! ఉండండి! నిద్రొస్తూంది......' అక్కయ్య మెల్లగా, మత్తుగా అంటోంది.

'అరె! రాత్రిళ్ళు నిద్రపోవడం ఎప్పట్నుంచీ?' నవ్వుతూ అన్నాడు బావ.

రుక్మిణి మరింక అక్కడ నుంచోకుండా చకచక మెట్లు ఎక్కేసింది. తమ్ముడు ఓ ప్రక్కగా గాఢమయిన నిద్రలో ఉన్నాడు. చాప పరుచుకొని పడుకొంది రుక్మిణి. చల్లనిగాలి మందంగా వీస్తోంది. శరీరానికి చల్లగావుంది కాని మనసు వేడిగా వుంది. ఏదో అసంతృప్తిగా వుంది. కళ్ళు మూతలు పడటంలేదు. శరీరం తన స్వాధీనం కోల్పోయిన ట్లనిపించసాగింది. ఏదో ఆవేదన. భవిష్యత్తు కళ్ళముందు భయంకరంగా కనిపించసాగింది. ఏమీ మార్పులేని ఇదే జీవితం ఇకముందుకూడా గడిపేయాలనే ఆలోచన గుండెలు పిండేస్తోంది. తన వయసు ఆడపిల్లల కుండే కోరికలు తనకీ ఉన్నాయి. తన స్నేహితురాండ్రందరిలాగానే తనూ వివాహం చేసుకుంటుందని కలలుకన్నది తను. ఓ యువకుని జీవితంలో చోటుచేసుకొని మధురమయిన రోజులు గడపొచ్చని అనుకొంది. నవలల్లో, సినిమాల్లో కనబడే అత్తగారి మందలింపులూ, ఆడబడచుల వేళాకోళాలూ, మఱదుల హాస్యాలూ, వీ టన్నిటి మధ్యా తనని ఊహించుకొని సిగ్గుపడింది. అప్పుడు తనకు తెలీదు. ఇలాంటి ఊహలు తనలాంటి ఆడపిల్లలకి

కాదు. తనూహించుకోవాల్సిన జీవితం వేరేవుంది. అది మంచి యవ్వనంలో ఊహకందకుండా మరుగున పడివుంటుంది. వయసు గడచినకొద్దీ వికటాట్టహాసం చేస్తూ అనుభవంలో కొస్తుంది. కనీసం తల్లిదండ్రులు తనకి చదువయినా సరిగ్గా చెప్పించి వుంటే ఎంతో బావుండేది. ఫిఫ్త్‌ఫారం చదువుతోండగా స్కూలు మానిపించేశారు. కనీసం యసల్సీ పాసయినా, ఎదురింటి అరవవాళ్ళమ్మాయి మీనాక్షిలా ఏదో ఉద్యోగం చేయడానికి వీలుండేది. మీనాక్షి తనకంటె పెద్దది. ఈ మధ్యనే వాళ్ళాఫీసులో పని చేసే ఓ అబ్బాయిని రిజిష్టర్ మారేజ్జేసుకొంది. అతను వీళ్ళకులం కాదుట. వాళ్ళమ్మ రోజూ తన తల్లిదగ్గరికొచ్చి ఈ సంగజ్జెప్పి విచారిస్తూండేది. కానీ తరువాత అలవాటుపడిపోయింది. 'మా అల్లుడు' అని చెప్తూవచ్చింది. అతను ప్రస్తుతం వీళ్ళింట్లోనే వుంటున్నాడు. ఆమె తండ్రికేమీ పట్టినట్లుండేదికాదు. ప్రొద్దుట్నుంచీ, సాయంత్రంవరకూ వసారాలో కూర్చుని, 'హిందూ' పేపరు చదువుతోండేవాడు. రోజూ సాయంత్రమయేసరికి మీనాక్షీ, ఆమె భర్తా షికారుకు వెడుతూ కనబడతారు తనకి. తెలీకుండానే ఎప్పుడో నిద్ర పట్టేసోయింది రుక్మిణికి.

ప్రొద్దున్న ఎవరో పిలచినట్లయి ఉలిక్కిపడి కళ్ళు విప్పింది. అప్పుడే తెల్లారుతోంది. సూర్యుడింకా ఉదయించలేదు. చల్లని గాలులు వీస్తున్నాయి. సత్యం నిండా ముసుగు పెట్టుకొని ముడుచుకు పడుకొన్నాడు. చాప చుట్టేసి లేచినుంచుంది రుక్మిణి. ప్రక్క డాబామీద ఇందిర కనిపించింది. పడుకొన్నప్పుడు పిట్టగోడ అడ్డుగా ఉండటంవల్ల తనకా అమ్మాయి కనిపించలేదు. తననిచూసి ఖంగారుగా నవ్వి మెట్లుదిగి క్రిందకి వెళ్ళిపోయింది. ఇందిర వాళ్ళు ప్రక్కింట్లోదిగి రెణ్ణెల్లవుతోంది. ఫోర్త్ ఫారం చదువుతోందమ్మాయి. నాలుగయిదుసార్లు వచ్చి చదువుకొనేందు కేవేనా నవలలుంటే ఇమ్మంటూ వచ్చింది. తరువాత మళ్ళీ వాటిని తీసుకొచ్చి ఇచ్చేసింది. తనని చూసి ఆ పిల్ల ఎందుకలా ఖంగారు పడిందో రుక్మిణి కర్థం కాలేదు. తలగడ చేత్తో పట్టుకొని మెల్లగా మెట్లు దిగిందామె. అప్పటికే అక్కయ్య పెరట్లో నూతిదగ్గర నుంచొని బ్రష్‌తో పళ్ళు తోముకొంటోంది. ఓ క్షణం ఆమె వంకే పరకాయించి చూసింది రుక్మిణి.

'నువ్వు కాఫీ పెట్టవే రుక్కూ. నే నీలోపల మీ బావగారికీ, నాన్నకీ మేలుకొలుపు పాడి, అమ్మకి మొఖం కడిగిస్తాను...' అందామె ముఖం కడుగుతూ. తలవూపి తన కార్యక్రమంలో లీనమయింది రుక్మిణి. మధ్యాహ్నం పదింటికి వంట గదిలో ఉండగా సావిత్రి చెల్లి నరుసు సరాసరి వంటగదిలో కొచ్చేసింది.

'అక్కా! నిన్ను సావిత్రక్క పిల్చుకు రమ్మంది' అంది గడపమీద కూచుంటూ.

'సావిత్రెప్పు డొచ్చింది?'

'నిన్నే! అక్క బావా వచ్చారు...'

'మీ బావగారెలా ఉన్నారే? మంచివాడేనా?' నవ్వుతూ అడిగింది సత్యవతి.

'ఓ! బోల్డుమంచాడు. నాకు మాంఛి ముత్యాల హారం, మా తమ్ముడికి ఏరోప్లేనూ తెచ్చాడు.

'సరేలే. వంటపనయిం తర్వాత మధ్యాహ్నం వస్తానన్జెప్పు సావిత్రితో...' అంది రుక్మిణి.

'ఊహూ! ఇప్పుడే రమ్మంది. వచ్చేవరకూ నన్నిక్కడే కూచోమంది...' అంది కళ్ళు తిప్పుతూ. సత్యవతి నవ్వేసింది.

'పోనీ వెళ్ళిరావే! ఇక్కడ నేనుంటానుగదా!' అంది రుక్మిణితో.

రుక్మిణి లేచి గదిలోకివెళ్ళి చీర మార్చుకొంటూంటే 'ఎక్కడికే?' అంటూ అడిగింది తల్లి. ఆవిడ ఆరోగ్యం చాలావరకూ నయమయింది.

'సావిత్రి వచ్చిందటే! నన్ను రమ్మని నరుసుతో కబురంపించింది...'

అద్దంలో చూచుకొంటూ జవాబిచ్చి ఆ పిల్ల వెంబడి బయల్దేరింది రుక్మిణి. బయటకు రాగానే వద్దనుకొన్నా ఎదుటి మేడమీదకు చూడకుండా ఉండలేక పోయింది. రెండు చేతులూ గడ్డానికి పోటే పెట్టుకొని తనవంకే చూస్తున్నాడతను. తలదిం

చేసుకొని సావిత్రి ఇంటివేపు నడిచిందామె. సావిత్రి తనకోసం గేటుదగ్గరే నుంచుని ఎదురుచూస్తోంది. తనని చూడగానే నంబరపడిపోయింది.

'ఏయ్ ఫూల్ ! ఆ రోజు చెప్పకుండా వెళ్లి పోయావేం?' అంది నవ్వుతూ.

'పెళ్లిపీటలమీదనుంచి ప్రక్కకు లాక్కెళ్లి చెప్పమన్నావేమిటి?' అంది రుక్మిణి.

ఇద్దరూ లోపలికి నడిచారు. గదిలో మంచం మీద కూలబడింతర్వాత 'ఇప్పుడు చెప్పవోయ్ ! ఎలా వుంది పెళ్లి?' అంది రుక్మిణి నవ్వుతూ.

'ఎలా వుండాలో అలానే వుంది !' అంది సావిత్రి తనూ నవ్వేస్తూ.

సావిత్రి కొంచెం క్రొత్తగా కనిపించింది రుక్మిణికి. కానీ ఆ మార్పేమిటోమాత్రం తెలీడంలేదు.

'నీ పార్ట్నర్ ఏమంటున్నారు?'

'ఏముందీ? తన గురించీ, తన ఫ్రెండ్స్ గురించీ హీరోయిక్‌డీడ్స్ అన్నీ చెప్తున్నారు.'

'మరి నువ్వూ మొదలెట్టలేదూ?'

'చెప్పనిస్తేనా !'

'లోపలికి రావచ్చా?' గడపదగ్గర నుంచుని నవ్వుతూ అడిగాడు ఆమె భర్త.

ఇద్దరూ చటుక్కున లేచి నుంచున్నారు. రుక్మిణి పైటనిండుగా కప్పుకొంది.

'రండి ! ఈమె మా ఫ్రెండ్ రుక్మిణి !' రుక్మిణిని చూపిస్తూ అంది సావిత్రి.

'నమస్తే !' అంది రుక్మిణి తలఎత్తి అతని వంక చూస్తూ. ప్రతినమస్కారంచేసి లోపలికొచ్చి కూర్చున్నాడతను.

'మీారు కూర్చోండి...మిమ్మల్నెప్పుడూ తల్చుకొంటూనే ఉంటుంది మీా సావిత్రి. అలా మరీ తల్చుకోకూడదూ, వాళ్లింట్లో ఆవిడ కెప్పుడూ పలమారుతూంటుందని చెప్పినా వినడంలేదు...'

ముగ్గురూ నవ్వేశారు.

'మీరునుంచునే ఉన్నారేం? కూర్చోండి ?''

రుక్మిణి సిగ్గుపడుతూనే సావిత్రి పక్కన కూర్చుంది.

'మీ స్నేహితురాలికి కాఫీ ఏమయినా ఉన్నదా? వత్త కబుర్లేనా?'' అన్నాడతను సావిత్రితో.

'ఇప్పుడే కాఫీ తీసుకొస్తాను కూచోవే...'' లోపలికి వెళ్తూ అంది సావిత్రి.

రుక్మిణి గుండెలు వేగంగా కొట్టుకొన్నయి. ఇలాంటి పరిస్థితెప్పుడూ అనుభవంలోకి రాలేదు. చచ్చే సిగ్గుగావుంది. ఓ క్షణమాగి అతనే మాట్లాడాడు.

'మీ సావిత్రి నేనేం చెప్పినా వినడంలేదండీ ! కొంపతీసి మీ ఫ్రెండ్సందరూ పెళ్లయింతర్వాత మొగుడుమాట ఛస్తే వినకూడదని రహస్యంగా ప్రతిజ్ఞలేం చేయలేదుకదా?''

నవ్వాగలేదు రుక్మిణికి. కిలకిల నవ్వేసింది. అప్పుడే రెండు ప్లేట్లలో బిస్కెట్లు తీసుకొచ్చింది సావిత్రి. ఏమీ మాట్లాడకుండా ప్లేట్లు ఇద్దరి ముందూ ఉంచి మళ్లీ లోపలి కెళ్లిపోయింది. ఓ రెణ్ణిమషాలాగి మళ్లీ అన్నాడతను.

'మీరు అవి తినరేం ? మీ సావిత్రి ప్రక్క నుండాలా ?'

నవ్వేసింది రుక్మిణి 'ఊహు?...అది కాదండీ...' అంది బిస్కెట్ అందుకొంటూ.

'మీరు మా మారేజ్ ఫొటోస్ చూళ్లేదు కదూ?' అడిగాడతను.

'లేదండీ!' అంది రుక్మిణి.

అతను లేచి టేబుల్‌మీదున్న ఓ ఆల్బమ్ ఆమెచేతికిచ్చాడు. ఒక్కొక్క పేజి చూడసాగింది రుక్మిణి.

'ఓ ఫొటో చూపిస్తాను. తలంబ్రాలు పోసే ప్పుడు సావిత్రి ఎంత కోపంగావుందో చూడండి!' ఆమెకి చేరువగావంగి ఆల్బమ్ ఆమె వళ్లో ఉండ గానే ఓ పేజీ త్రిప్పి చూపించాడతను. రుక్మిణికి ఆ ఫొటో చూస్తే నవ్వాగలేదు.

సావిత్రి కాఫీలు ట్రేలోపెట్టుకొని లోపలికొచ్చింది. వాళ్ళని చూడగానే ఆమె మొఖం చిన్నబోయింది.

ముగ్గురూ కాఫీలు త్రాగారు. సావిత్రి మూగదానిలా కూచుంది. అతనే ఏవేవో మాట్లాడాడు.

'ఇక వెళ్తానే!' అంది రుక్మిణి సావిత్రితో.

సావిత్రి లేచి నుంచుంది.

'వెళ్తానండి! నమస్తే!' అతనితో అని బయటకి నడిచింది రుక్మిణి.

సావిత్రి గేటువరకూ వచ్చింది. ఏదో విలువయిన వస్తువు పోగొట్టుకొన్నదానిలా ఆమె ముఖం వాడిపోయింది.

'మువ్వా, మీ శ్రీవారూ ఓసారి మా యింటికి రారాదూ, ఓ చిన్నపార్టీ ఇస్తాను...' అంది రుక్మిణి గేటుదగ్గర నుంచుని.

'ఊహూ! ఆయన కొకళ్ల ఇళ్ళకి వెళ్ళడం ఇష్టం వుండదు......' మరోవేపుకి చూస్తూ అంది సావిత్రి.

రుక్మిణి విస్మయంతో ఆమెవంక చూసింది.

'సరే! ఇక వెళ్ళు......' అంటూ చివాలున వెనక్కితిరిగి వెళ్ళిపోయింది సావిత్రి.

రుక్మిణి తెల్లబోయింది. ఆమె కళ్లల్లో ఉక్రోషం తొంగిచూసింది. కళ్ల వెంబడి నీళ్లు తిరిగినయి. ఇంటివేపు మెల్లగా నడువసాగింది. సావిత్రి అలా ప్రవర్తించగలదని ఎప్పుడూ ఊహించుకోలేదు తను. అలా ఆమె మారిపోవడానికి కారణం అస్పష్టంగా అలుక్కుపోయినట్లు కనిపిస్తోంది. అదే కారణం అనుకోడానికి మనసు వప్పుకోడంలేదు. అది కాకుండావుంటే బావుండుననిపిస్తోంది.

ఇంటికి వచ్చేసరికి సత్యం, బావగారూ ఎక్కడెక్కడో తిరిగొచ్చేశారు. సత్యవతి వంటింట్లో హడావుడిగావుంది. తనూ ఆమెకి సాయపడసాగింది రుక్మిణి.

సాయంత్రమయేసరికి పనంతా ముగించుకొని వరండాలో కుర్చీలో కూర్చుంది రుక్మిణి. ఇల్లంతా నిశ్శబ్దంగావుంది. మేడమీద అతను తనవంకే చూస్తూ కిటికీదగ్గర కూర్చున్నాడు. లేచి లోపలికి వెళ్లిపోవాలనుకొంది కానీ 'అతను చూస్తే మనకేం?' అనుకొని కూర్చుండిపోయింది. అక్కయ్యా బావా గుడికి వెళ్లారు. రోడ్‌మీద సావిత్రీ ఆమె భర్తా ఎక్కడికో వెడుతూ కనిపించారు. తమ ఇంటికేసైనా చూడకుండ సావిత్రి వెళ్లిపోవడం రుక్మిణి మనసుకి బాధ కలిగించింది. క్రమేణా చీకటి వ్యాపిస్తోంది. వీధిలో మునిసిపల్ దీపాలు వెలిగినయి. లోపలికి నడిచి లైట్ స్విచ్‌ఆన్ చేసిందామె. లైట్లు వెలగలేదు. బయటకూడా దీపాలన్నీ ఆరిపోయినయి. క్రొవ్వొత్తికోసం సత్యం పుస్తకాల అల్మారాతీసి వెదికింది రుకి్మణి. ఓమూల క్రొవ్వొత్తిప్రక్కనే కొన్ని నీలంరంగు కాయితాలు కనిపించినయి.

క్రొవొత్తి వెలిగించి ఆ కాగితాలు తీసి చూసిందామె. లోపల అందమయిన దస్తూరి, ఓ ఆడపిల్లదని తెలిసిపోతోంది.

'ఏమండీ,

నిన్న సినిమాకి రాలేకపోయాను క్షమించండి. స్కూలు మానేయాలంటే భయం వేసింది. నా ఫ్రెండ్సందరూ నాతో కలిసే స్కూలుకొచ్చారు. మీరు నాకోసం హాలు దగ్గర ఎదురుచూసి వుంటారనుకొంటాను. ఏం చేయను. వచ్చే ఆదివారం తప్పకుండా ఏదోహ సినిమాకి వెళ్దాము. ఈ సంగతి చెప్పటానికి ప్రొద్దున్నే డాబామీదకొచ్చి మిమ్మల్ని పిలచాను. కాని మీ అక్కయ్యకూడా అక్కడే వడుకొందని తెలీలేదు. ఆవిడ లేచి మంచునేసరికి భయం వేసి వెళ్ళిపోయాను. మిమ్మల్ని పిలవడం ఆవిడ విందేమోనని భయంగా వుంది. మీది మరీ బండనిద్ర. రేపైనా మెలకువగా వుండండి. ఏ సినిమాకి వెళ్ళాలో రాత్రి కాలోచించి చెప్పండి...మీ ఇందిర...'

ఉత్తరం చదివి ఆశ్చర్యంలో మునిగిపోయింది రుక్మిణి. ఏదో ఇంగారుగా కూడా ఉంది. ఆ పిల్లేదో చేయరాని పనిచేస్తున్నట్లు అనిపించింది. మిగతా ఉత్తరాలేవీ చదువ బుద్ధికాలేదు. వాటన్నిటినీ యథాస్థానంలో ఉంచేసింది. అయితే సత్యం చాలా పెద్దవాడయి పోయాడన్నమాట,....

రెండ్రోజులు గడిచినయి. అక్కయ్యా బావా వెళ్ళిపొయ్యారు. 'మా ఫ్రెండ్స్‌తో సినిమాకు వెడుతున్నాను...' అని వెళ్ళిపోయాడు సత్యం. రుక్మిణి కాలెండరు చూసింది. ఆ రోజు ఆదివారం. ఇందిర సత్యానికి వ్రాసిన ఉత్తరం గుర్తు కొచ్చిందామెకి. అవును వాడు ఇందిరతో సినిమాకి వెళ్తాడు.

మధ్యాహ్నం రెండయిపోయింది. ఎండ కొంచెం ఎక్కువగానే వుంది. తల్లి నిద్రపోతోంది. తండ్రి ఆఫీసుకు వెళ్ళిపోయాడు మామూలుగా. నిద్రపోడానికి విశ్వప్రయత్నం చేయసాగింది రుక్మిణి. కానీ నిద్ర పూర్తిగా తేలిపోయింది. ఏవేవో ఆలోచనలు. సావిత్రి తనకి ప్రాణ స్నేహితురాలు. చిన్నప్పట్నుంచీ ఇద్దరూ పరస్పరం ఎంత ప్రేమగా ఉండేవారో గుర్తు తెచ్చుకోడానికి బోలెడు సంఘటనలున్నాయి. ఓ సారి తనకి జ్వరంవచ్చి రెండ్రోజులు స్కూలు మానివేస్తే ఆ రెండ్రోజులు సావిత్రి స్కూలు మానేసి తనదగ్గరే కూచుంది. మరోసారి తను అకస్మాత్తుగా దగ్గర్లో ఉన్న చిన్నాన్నగారి ఊరువెడితే, సావిత్రి తన కోసంవచ్చి, చెప్పకుండా తనువెళ్ళిపోయిందని ఏడుస్తూ కూర్చుందిట. అమ్మ ఇప్పటికీ ఈ సంగతి చెప్పి నవ్వుతూంటుంది. అలాంటి సావిత్రి ఇప్పుడు తనని చూసి ఈర్ష్య పడుతోంది. సావిత్రేకాదు. అసలు తమ ఆడజాతే అంత. వాళ్ళల్లో ఎప్పుడూ ఈర్ష్య రగులుతూ ఉంటుంది. తల్లికి క్రొత్తగా పెళ్ళయిన కొడుకునీ, కోడలినీ చూస్తే ఈర్ష్య, అత్తారింటి గురించి గొప్పలుచెప్పే కూతురిని చూస్తే ఈర్ష్య, అమ్మాయిలకి పరిచయంలేని అమ్మాయి లందరిమీదా ఈర్ష్య, స్నేహితురాండ్రమీద మరో రకపు ఈర్ష్య, అక్కకి చెల్లెలిమీద ఈర్ష్య, ఆడబిడ్డలకి వదినంటే ఈర్ష్య, అంతా ఈర్ష్యే. ఆడదానిలోని ఈ విపరీతశక్తే ఆమెని అణగద్రొక్కేస్తోంది. తోటి ఆడదానిమీద ఈర్ష్య ఆమెని మొగాడికి బానిసగా చేస్తోంది. రుక్మిణి కళ్ళవెంబడి నీళ్ళు కారిపోతున్నయి. మనసంతా తెలియని ఆవేదనతో నిండిపోయింది. చాలాసేపటికి మగతగా నిద్ర పట్టింది. ఏవేవో పిచ్చికలలు. అక్కా బావా విపరీతంగా నవ్వుతున్నారు. సావిత్రి భర్తమీద వాలిపోయి తన్మయుత్వంతో చూస్తోంది. ఇందిరా సత్యం సినిమాలో ప్రక్కప్రక్కనే కూర్చున్నారు. మీనాక్షి ఆమె భర్త నవ్వుకొంటూ నడచి వెడుతున్నారు. మేడమీద అతను తన దగ్గరగావచ్చి భుజంచుట్టూ చేతులువేసి నవ్వుతూ 'ఎందుకలా భయపడతావు?' అంటున్నాడు. ఎవరో తట్టినట్లయి ఉలిక్కిపడి లేచింది రుక్మిణి. తల్లి దగ్గరే నుంచొనిఉంది.

'ఏమిటే ఆ కలవరింతలు—లే ఇక—అయిదున్నరవుతోంది......సాయంత్రం నిద్ర పోకూడదు...' అందామె.

లేచి కూర్చుంది రుక్మిణి. మనసంతా ఖాళీ అయిపోయింది...మేడమీద కుర్రాడు ఇంకా కళ్ళల్లోనే మెదులుతున్నాడు. తను కనబడినప్పుడు అతని కళ్ళల్లో ఏదో వెలుగు కనిపిస్తుంది ఎందుకనో?

'కొంచెం కాఫీ కాస్తావుటే?'

'ఇప్పుడే తీసుకొస్తానమ్మా!' లేచి వంటింట్లోకి నడిచింది రుక్మిణి. సన్నని కూనిరాగం తీస్తూ స్టౌ వెలిగించింది.

'అదేమిటి...అతను కలలో కొచ్చాడు!' అనుకొని సిగ్గుపడిందామె.

ఆ క్షణాన్న ఆమె తల్లినీ, తండ్రినీ, ఇందిరనీ, సత్యాన్నీ, సావిత్రినీ, అక్కయ్యనీ, మీనాక్షినీ—అందరినీ మరచిపోయింది. ఆఖరికి తనని గూడా.

———